# శ్రీవారికి ప్రేమలేఖ...

" మబ్బుల మీద మబ్బులు కమ్ముకు వస్తున్నాయి..

చీకటి పడుతోంది ప్రియా!

నన్నొంటరిగా ఈ తలుపు దగ్గర నీకై నిరీక్షణలో ఎందుకిట్లా వదిలివేశావు?

నువ్వు నీ ముఖం కనబరచకపోతే.. నన్నింత ఎడం చేసి వదిలేస్తే..

ఈ దీర్ఘ ఘడియలన్నీ ఎట్లా గడపగలనో తెలీదు!!"

--గీతాంజలి

రాత్రి నిద్రకి ఉపక్రమిస్తున్నట్లుంది.. చుట్టూ పర్చుకుంటున్న నిశ్శబ్దం..

నెలవంకకి చలి వేస్తుందేమో! ఉన్నట్లుండి మబ్బుతెరలను కప్పుకున్నాడు..

కాళ్ళు రెండూ దుప్పట్లో.. ఉయ్యాలూగుతూ నేను.. కనీసం ఈ రాత్రన్నా మన గురించి పెద్దగా తలచుకోకుండా ఉండాలని విశ్వప్రయత్నం చేస్తూ.. ఉహూ.. కుదిరేటట్లు లేదు!

రోజా నీ చుట్టూ తిరిగే ఆ ఇంకో వ్యక్తి జాడేదన్నట్లు మనీప్లాంట్ తీగ ఉండుండి తలవంచి చూస్తోంది..

ఏం చేస్తున్నారు? 'ఏంటీ సడెన్‌గా ఇంత పెద్ద ఈమెయిల్ !' అనేసుకుంటూ ఆశ్చర్యపోతున్నారు కదూ.. మీరు ఇందాక Valentine's Day greetings చెప్పి ఫోన్ పెట్టేసిన తర్వాత అనిపించింది మీతో చాలా మాట్లాడాలని..

అదిగో, నాకు తెల్సు మీ నెక్స్ట్ ప్రశ్న.. "అయితే ఫోన్ చేయొచ్చుగా!?"

లేదు.. నాకిలానే మాట్లాడాలని ఉంది!

అయినా మనం ఈమెయిల్స్ రాసుకుని యుగాలైపోలేదూ!! పెళ్ళైన కొత్తల్లో మీరిక్కడ నేనక్కడ ఉన్నప్పుడు, మీరు రాసే నాలుగు లైన్ల కోసం నేను.. నానుంచి వచ్చే నాలుగు పేజీల కోసం మీరు.. ఎన్నెన్ని ఎదురుచూపులో!! రిప్లై ఇవ్వడం లేట్ అయితే అలకలూ.. గదమాయింపులు.. కిటికీ పక్కన కూర్చుని, పాటలు వింటూ మీకు రాసే ఏకాంతం కోసం ఏ ఝాము వరకు మెలకువ ఉండేదాన్నో!!

మరి ఇప్పుడు? అంతా అ..ల..వా..టు అయిపోయింది! మీరు.. మనం .. రొటీన్ !! ఎప్పుడన్నా ఏదన్నా చెప్పాలనిపిస్తే.. అర చేతుల్లోనే సెల్ ఫోన్ .. స్పీడ్ డైల్ .. అంతే! మాటర్ చేరిపోతుంది!! ఆ నిరీక్షణ.. ఆ ఎగ్జైట్‌మెంట్ ఒకనాటికి అర్థంలేని పదాల్లా మిగిలిపోతాయేమో కదా!? ఇక ప్రేమలేఖలు పెళ్ళికి ముందు, పెళ్ళైన కొత్తల్లో వరకే

పరిమితమేమో!? ఉత్తరాల నించి ఈమెయిల్స్ .. ఈమెయిల్స్ నించి సెల్ ఫోన్స్ .. ప్రపంచం అంతా ఒకే ఊరులా మారిపోతోంది.. కానీ.. మనుషులు దూరమైపోతున్నారని అనిపించట్లేదూ!?

చలం అంటారు, "ఒక ప్రేమలేఖ పుట్టాలంటే ఇద్దరి మధ్యా వియోగం తప్పనిసరి.. అందులో మంచి ప్రేమలేఖ రాయాలంటే ఎదుటి వ్యక్తి మీద ఎంతో గౌరవం , తీవ్రమైన ఆకర్షణ, ఇంకా మనోద్రేకాల్ని యధాతథంగా మాటల్లోకి మార్చగలిగే నేర్పూ ఉండాలంట!"

ఎప్పుడూ చెప్పాలనుకుంటాను.. మీరు దగ్గరలేనప్పుడల్లా నా ప్రాణాలేదో మీతో పంపేసినట్లు, ఊపిరి స్థంభించినట్లు అదేదోగా ఉంటుంది.. అలా అని మనసులో తట్టుకోలేని బాధేమీ ఉండదు.. అదొక చెప్పలేని అనిస్థితి.. మరి దీన్ని ప్రేమంటారో, విరహమంటారో, లేక మిస్ అవడం అంటారో నాకైతే తెలీదు..

అసలు మనదేమీ మనసులు కలిసి పుట్టిన ప్రేమ కాదుగా.. అయినా సరే ఇలా అనిపించటం సాధ్యమేనా! ఫోటోలు నచ్చటం .. పెద్దవాళ్ళ మాటలు .. పెళ్ళికి ముందు పది అడుగులమేర ఏకాంతంలో మాటలు.. అంతే! కలిసి నడవడం మొదలుపెట్టాం .. ఆ బంధంతో మొదలయ్యి, ఎంతో అవగాహన.. ఎన్నో సర్దుబాట్ల వల్ల ఏర్పడ్డ దగ్గిరతనం.. దీనికి ప్రేమ, ఇష్టం , ఆప్యాయత, అనురాగం ఏదన్నా పేరు పెట్టుకోండి.. మీ ఇష్టం!

గుర్తున్నాయా? మనం మొట్టమొదటిసారి మాట్లాడుకున్న క్షణాలు?? డిసెంబరు 20 ఉదయం.. మంచు తెరలు సరదా చూడ్డానికి వచ్చినట్లు పల్చ పల్చగా మన చుట్టూనే! మీరడిగారు, 'నాలో నీకేమి నచ్చిందని'..
'మీ నవ్వు!'..
అవును! మీ నవ్వు చూడగానే నాకు తిలక్ 'గుండె కింద నవ్వు' గుర్తొచ్చింది.. అదే మాట మీతో అంటే 'తిలక్ అంటే మహా భారతం రాసినాయనేగా?' అన్నారు..

కాస్తంత ఉలికిపాటు నాలో! తిలక్‌కి, తిక్కనకి తేడా తెలీని మీతో, సాహిత్యాన్ని ఇష్టసఖిని చేసుకున్న నేను ఎలా అడుగులు వేయగలనా అనుకున్నాను.. రెండు భిన్న ధ్రువాలు ఒకేదారిలో ప్రయాణం చేయబోతున్నాయని చూచాయగా అనిపించింది.. అది ఖచ్చితం అవడానికి ఎక్కువ రోజులు పట్టలేదు..

రోజులు గడిచేకొద్దీ మన అలవాట్లు, అభిరుచులలో ఎక్కడా పొంతన లేకపోవడం ఇద్దర్నీ కలవరపరచడం ఒకరికొకరికి తెలుస్తూనే ఉంది.. తెల్లవారుఝామున చలి చిన్న చిన్న గా మనల్ని తాకుతుంటే.. కలిసి వాకింగ్ కి వెళ్ళాలని అనిపిస్తుందంటే 'అబ్బే వద్దు.. జలుబు చేస్తుందనేవారు'.. పోనీ సాయంత్రం బయట కూర్చుని ఆ రోజు

విషయాలన్నీ మాట్లాడుకుందామంటే 'అమ్మో హెడ్ లైన్ న్యూస్ మిస్ అవుతాననేవారు'..

వీకెండ్ ఫిషింగ్ కి వెళ్దామని మీరడిగితే 'అహ్.. నాకు బోరు' అని నేను.. ఇండియన్ రెస్టారెంట్‌కి వెళ్దామని నేను, మెక్సికన్ రెస్టారెంట్‌కి వెళ్ళి అవేవో నోరు తిరగని తిండి తిందామని మీరు! నా కిషోర్ , బాలూలను మీ Red Hot Chilli Peppar, Madonnaలు డామినేట్ చేస్తుంటే.. ప్రతి విషయంలోనూ అభిప్రాయాలు వేరవుతుంటే అలకలూ.. చిరాకులు.. కోపాలు.. ముభావం.. రెండు మూడు రోజులు వరుసగా మాట్లాడుకోక పోవడం .. జీవితం మీద నిరాసక్తత మొదలైన రోజులు..

సరిగ్గా అలాంటి ఒకరోజునే మీరు మొదటిసారిగా మనసు విప్పి మన గురించి మాట్లాడారు.. 'నేనంటే నీకెంత ఇష్టం అని అడగను.. కానీ మన వివాహం మీద నమ్మకం ఉందా? లేక మనిద్దరికీ ఇలానే పడకపోతే వేరే పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యం ఉందా?' అని సూటిగా మీ నుంచి వచ్చిన ప్రశ్నకి నేను చివాలున చూశాను..

నా చూపును ఏమాత్రం పట్టించుకోకుండా మీ ధోరణిలో 'నాకైతే నీతోనే జీవితాంతం ఉండాలని ఉంది.. నా అలవాట్లు నీకెలా కొత్తో అలానే నీవి నాక్కూడా కొత్తే!! మనిద్దరం కలిసి ఉండాలంటే కాస్త శ్రమ తీసుకోవాల్సిందే. అదీ అలవాటయ్యేవరకు మాత్రమే! ఏమంటావు?'.. అనడానికి మాటలేమీ లేక మీ చేతిలో చేయుంచాను..

అలా మొదలైన మన ప్రయత్నంలో నేను మొదటగా నేర్చుకుంది ఒకరి అభిరుచులని ఇంకొకరు గౌరవించటం!

ఎవరన్నారు? ఇష్టాలు కలిస్తేనే మనసులు దగ్గరవుతాయని! తనకే మాత్రం తెలియక/ఇష్టం లేకపోయినా కేవలం మన కోసం ఒక పని చేసారంటే ఆ వ్యక్తి మీద అభిమానం ఎంత అనూహ్యంగా పెరిగిపోతుందో అస్సలూహించలేము..

మన రెండవ యానివర్సరీకి నాకు ఇచ్చిన గ్రీటింగ్ కార్డ్ లో మీరు రాసిన
"నింగిలోని వేలుపులు ఎంత కనికరించారో.. నిన్ను నాకు కానుకగా పిలిచి కలిమినొసగేరు"
వాక్యాలు చూడగానే కళ్ళ నిండుకున్నాయంటే అది నా తప్పు ఎంతమాత్రమూ కాదు..

తెలుగు సాహిత్యం, సంగీతం ఏ మాత్రం పరిచయం లేని మీరు రాసిన ఆ రెండు వాక్యాలున్న ఆ కార్డ్ నేనందుకున్న మొదటి అసలైన ప్రేమలేఖ! I think that was the moment I fell in love with you! అలానే, అలారంలో సుప్రభాతం బదులు మీకిష్టమైన రాక్ మ్యూజిక్ చానెల్ పెట్టినప్పుడు, అంత నిద్రలో కూడా మీకళ్ళు ఆశ్చర్యంతో మెరవడం నేను మర్చిపోలేను..

అసలైతే కొన్ని సంవత్సరాల వరకూ దగ్గరతనం ఉండి, తర్వాత్తర్వాత నెమ్మదిగా ఇద్దరి మధ్యా తెలీని తెరలు ఏర్పడుతుంటాయి అంటారు కదా.. కానీ ఇది అసహనం లోనించి, అసంతృప్తి లోనించి బయటకొచ్చి సాధించుకున్న అనుబంధం.. ఎన్ని సార్లు పోట్లాడుకోలేదు మనం!! అన్ని సార్లూ కూర్చుని పరిష్కారం గురించి మాట్లాడుకున్నాం .. అదే నేమో.. ఆ 'మాట్లాడుకోవడమే' ఇంతలా పని చేసింది.. అనురాగమనే తీగలా మనచుట్టూ అల్లుకుపోతోంది..

అలా అని ఇద్దరం ప్రతి క్షణం ఒకరిచుట్టూ ఒకరం ఏమీ కాదు.. బయటకెళ్తే స్నేహితులు, పనులు, ఎవరి ప్రపంచం వాళ్ళది.. ఇంటికొస్తే మాత్రం ఒకటే లోకం .. అది మనది!!

అయినా ఇప్పటికీ ఒకరికొకరు కోపం తెప్పించే పనులు చేయడం మానలేదుగా! బయటకెళ్దామని చెప్పిన టైంకి నేనెప్పుడూ రెడీ కాకపోవడం, ఫోన్ లో మాట్లాడేటప్పుడు బిగ్గరగా మాట్లాడటం మీకు కోపం తెప్పిస్తే.. స్నానం చేసి తడి టవల్ మంచం మీద గిరాటు వేసేసి వెళ్ళి పోవడం , వీకెండ్స్ లో టూత్ బ్రష్ నోట్లో పెట్టుకుని ఇల్లంతా తిరుగుతూ ఒక గంటసేపు పళ్ళు తోముకోవడం నాకు అసహనం కలిగించే విషయాలు!!

కానీ పర్లేదు.. ఇవి భరించడం ఏమంత కష్టం కాదు.. అయినా ఒకరి గురించి ఒకళ్ళు మన ఫ్రెండ్స్ దగ్గర చెప్పుకోవడానికి ఈ మాత్రం చిన్న చిన్న లోపాలు లేకపోతే బావోదు :-)

ఫ్రెండ్స్ అంటే గుర్తొచ్చింది.. నిన్నొక తమాషా జరిగింది.. తీరికగా ఉన్నా కదా అని లంచ్ అయిన తర్వాత మన బట్టల అలమరా సర్దటం మొదలుపెట్టాను.. చక్కగా జగజీత్ సింగ్ గజల్స్ సిడి ఒకటి ఆన్ చేసుకుని, బట్టలన్నీ తెచ్చి మంచం మీద వేసి ఒక్కొక్కటీ మడతలు పెట్టడం మొదలు పెట్టాను...

ఇంతలో మొదటిసారి ఇండియా నించి వచ్చినప్పుడు మీకోసం తెచ్చిన లుంగీలు కనిపించాయి.. ఎన్నిసార్లు బ్రతిమాలగానో మీరు ఒకసారి కట్టుకుని నడవటం చేతకాక పడబోతే ఇంక వద్దులేమన్నాను... మీరు 'హమ్మా! థాంక్యూ' అని నుదిటి మీద చిన్న ముద్దు పెట్టి వెళ్ళి పోయారు.. ఆ క్షణాలు గుర్తొచ్చాయి.. మీరింకా గుర్తొచ్చారు.. దిగులేసి మంచం మీద అలానే పడుకున్నాను.. ఎప్పుడు నిద్రలోకి జారుకున్నానో తెలీనే లేదు..

ఇంతలో కాలింగ్ బెల్ మోగడంతో మెలకువ వచ్చింది.. అలానే నిద్ర కళ్ళతో వెళ్ళి తలుపు తీసి చూసాను.. మన కమ్యూనిటీలో ఉండే శ్రీకాంత్ వైఫ్ రమ్య.. గుర్తుంది కదా? మొన్ననే ఇండియా నించి వచ్చింది.. తనని షాపింగ్ కి తీసుకెళ్తానని చెప్పిన విషయం అప్పుడే గుర్తుకొచ్చింది. నేను లోపలికి రమ్మని అనేలోగానే తను నావంక పైకీ కిందకీ

ఒకసారి చూసి, 'అయ్యో సారీ అక్కా డిస్టర్బ్ చేశాను.. బావగారు ఇంకా రాలేదనుకున్నాను' అనేసి కంగారుగా వెళ్ళిపోయింది.. అప్పటికి నాకు కాస్త నిద్ర మత్తు వదులుతున్నట్లు అనిపించి 'ఏమైందీ అమ్మాయికి!' అనుకుంటూ మొహం కడుక్కుందామని బాత్ రూం లోకి వెళ్ళాను..

నీళ్ళు మొహం మీద చల్లుకుంటూ అద్దంలోకి చూసుకున్నాను.. అంతే!! నా నిద్ర మత్తు పూర్తిగా వదిలిపోయింది!! అప్పుడర్థం అయింది, ఆ పిల్ల అలా కంగారుగా ఎందుకెళ్ళిపోయిందో! లేచి వచ్చేటప్పుడు నేను చున్నీ అనుకుని లుంగీ మెడ చుట్టూ వేసుకొచ్చాను!!! గట్టిగా 'దేవుడా!' అనుకున్నా.. నల్లగా ఉన్న నా మొహం కూడా ఎర్రబడుతుందని మొదటిసారిగా అప్పుడే అర్థం అయింది.. వెంటనే పరిగెత్తుకెళ్ళి తనని తీసుకొచ్చి, గదులన్నీ తిప్పి చూపిస్తేగానీ నమ్మలేదు, 'మీరింకా  రాలేదని'!

మరీ అంతలా నవ్వుక్కర్లేదు.. అసలు ఇంత ఎంబారసింగ్ మూమెంట్ ఎప్పుడూ ఎదురవ్వలేదు తెలుసా!! తర్వాత షాపింగ్ చేస్తూ రమ్య, నేను ఒకటే నవ్వులు.. కొత్తగా పెళ్ళైంది కదా, మనం కొత్తల్లో ఎలా ఉండేవాళ్ళమో అన్నీ అడిగింది.. అప్పట్లో అంటీముట్టనట్టుగా ఎలా తప్పించుకు తిరిగేవాళ్ళమో.. ఇప్పుడు ఎంతలా మీకోసం ఎదురుచూస్తున్నానో.. ఈ మధ్యలో జరిగిన పరిణామాలు కొంచెం కొంచెంగా చెప్తుంటే కాస్తంత ఆశ్చర్యం కనిపించింది తన కళ్ళల్లో!

చివరగా మీరు నాకొకసారి చెప్పిందే తనకీ చెప్పాను.. Never end a day with an argument!   కోపంగా.. వికలమైన మనసుతో నిద్రకి ఉపక్రమించటం అంత బాధాకరం ఇంకోటి ఉండదు.. ఎంత ఆలస్యమైనా ఏదో ఒక ఒప్పందం చేసుకుని పడుకుంటే.. పొద్దున్నే కళ్ళు తెరిచీ తెరవకుండానే పలుకరించే మీ స్పర్శ చాలు క్రితం రోజు మనస్తాపాలన్నిటినీ మాయం చేయడానికి..

రమ్యే అడిగింది రేపు వేలంటైన్స్ డే కదా, బావగారికి ఏమిస్తున్నావని! అప్పుడంత పట్టించుకోలేదు కానీ ఇందాక మీ ఫోన్ తర్వాత అనిపిస్తుంది, ఒక ప్రత్యేకమైన రోజున మిమ్మల్ని మిస్ అవుతున్నానని!! ఏం పని చేస్తారు కానీ ఇంటికి వచ్చేయ కూడదూ.. ప్లీజ్..

'చీకటిలో వాకిట నిలిచి.. దోసిట సిరిమల్లెలు తొలిచి.. నిదుర కాచి నీకై వేచి.. నిలువెల్లా కవితలు చేసి..'
లాప్ టాప్ లో నించి పాట వినబడుతోంది.. అసలు ఈ కవులు ఇంత బాగా ఎలా రాయగలరో కదా!! అన్నీ మనలో కదలాడే భావాలే!! పుస్తకం , పెన్ను పట్టుకుని.. మన పక్కనే నించుని.. మన మనసుల్లోకి తొంగి చూస్తూ రాసినట్లు!!

గుర్తుందా, రెండు సంవత్సరాల క్రితం వేలంటైన్స్ డే వీకెండ్ న వచ్చింది.. పగలంతా ఇంటి ముందూ చుట్టూ ఎన్నో మొక్కలు పెట్టాము.. సాయంత్రం మీ ఫ్రెండ్ సల్మాన్ తో కలిసి పని ఉందని బయటకెళ్ళారు.. మీరొచ్చేసరికి వంట చేసి, బయట ఉయ్యాల దగ్గర అన్నీ రెడీగా పెడితే.. ఒక్క క్షణం నావంకే చూసి 'Will you be my wife in my next life too' అన్నారు.. దానికి నేను చాలా సీరియస్‌గా ‘సారీ అండి, ఆల్‌రెడీ మా పక్కింటబ్బాయి రాజేష్ కి మాటిచ్చేసాను‘ అన్నా.. మందారాలు ఫక్కున నవ్వాయో లేక మీరే ఉడుక్కున్నారో.. ఇల్లంతా ఒకటే పరుగులు!!

ఎంతో ప్రాక్టికల్ గా ఆలోచించే మీరు అలా ఎమోషనల్ గా మాట్లాడటం చాలానే ఆశ్చర్యం కలిగించింది.. వచ్చే జన్మల మీద నాకు అంత నమ్మకం లేదు.. కానీ ఈ జన్మకి మాత్రం ఇలానే ఉందాం.. ఎప్పటికీ.. ఏమంటారు?

Wish you a happy Valentine's day!!

